కాంగ్రెస్ సర్కారుకు రైతుల ఉసురు తగులుతుంది

● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రైతుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, నవంబర్ 5 : రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగ య్య అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద కాపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఫొటోలకు ఫోజులిచ్చేందుకు, ప్రచారం కోసం ప్రారంభించారే తప్ప ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం లేదన్నారు. నెల రోజుల నుంచి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కొనుగోళ్లు పారంభించక పోవడంతో రైతులు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని మళ్లీ తీసుకెళ్లి దళారులకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద కాపర్తి గ్రామంలో కేంద్రాన్ని ప్రారంభించి నెల రోజులైనా నేటికీ ఒక్క గింజ కూడా కొనలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. రామన్నపేటలో పెట్టబోయే సిమెంట్ పరిశ్రమను రద్దు చేసిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వల్ల ఎకరానికి రూ.70లక్షల విలువ చేసే సారవంతమైన భూములు పనికిరాకుండా పోయి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రజల కోరిక మేరకు కంపెనీ ఏర్పాటును రద్దు చేసి ఆ భూమిని పేదలకు పంచాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి : ఎస్పీ

పదోన్నతి పొందిన వారికి బ్యాడ్జి అందిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, నవంబర్ 5 : ఉద్యోగులు క్రమశిక్షణతో పాటు బాధ్యతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. మంగళవారం ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో పనిచేస్తున్న 8 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించి పట్టీలను అందించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అర్మ్డ్ హెడ్ కానిస్టేబుల్ రతన్‌లాల్ కుటుంబానికి రూ.2 లక్షల చేయూత చెక్కును ఎస్పీ అందించారు. ఆర్ఐ సంతోశ్, పోలీస్ అధికారుల సంఘం నాయకులు జయరాజు, సోమయ్య పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు వైద్యసేవలందించాలి : డీఎంహెచ్ఓ

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

నీలగిరి, నవంబర్ 5 : గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆరోగ్య పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందేలా చూడాలన్నారు. గర్భిణులకు ఆరోగ్య సాయం అందిస్తూ వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు వేణుగోపాల్‌రెడ్డి, గీతావాణి, కేస రవి, పీఓడీటీటీ కృష్ణకుమారి, డీటీసీఓ కల్యాణచక్రవర్తి, డీఐఓ పద్మ, ప్రొగ్రాం ఆఫీసర్లు అరుంధతి, రాజేష్, డీఎంఓ దుర్గయ్య, శాంతకుమారి, శ్రీనివాసస్వామి, సత్య, మహేశ్వరి, మోతీలాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి

● సంఘం జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్

మాట్లాడుతున్న ఫణి కుమార్

నిడమనూరు, నవంబర్ 5 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీఆర్‌టీయూ టీఎస్ పని చేస్తున్నదని సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదులో భాగంగా మంగళవారం ఆయన స్థానిక ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం కృషి ఫలితంగానే ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు బదిలీలు జరిగాయన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు పాంపాటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మంత్రాల సురేందర్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ అద్దంకి సునీల్‌కుమార్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్షయింటు అయిన వాసాం శ్రీనివాస్, తండ్రి సత్తయ్య, వయసు:40 సం., నివాసం: ఇ.నెం.8-137, మోత్కూరు గ్రామం & మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నేను కొనుగోలు చేసినటువంటి ఖాళీ స్థలం యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం.1195/2018, దాని యొక్క లింకు దస్తావేజులు నెం.906/1996, Dated:07-10-1996, 2303/2014 Dated: 16-12-2014 SRO-Mothkur, ద్వారా సంక్రమించినవి. ఇట్టి లింకు దస్తావేజులు మోత్కూరు బస్ స్టాండ్ నుండి జిరాక్స్ షాప్‌కి వెలుచుండగా మార్గమధ్యములో పోయినది ఇట్టి విషయమై మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు నమోదు చేసినారు సదరు ఆస్తి యొక్క వివరములు ఖాళీప్లాట్ నం. 31, విస్తీర్ణం 175.00 చదరపు గజములు=146.322 చదరపు మీటర్లు బ్లాక్ నం.10, కొత్తది బ్లాక్ నం.6, మోత్కూరు గ్రామం & మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు ఉత్తరం:15.00 వైడ్ రోడ్డు, దక్షిణం: ప్లాట్ ఆఫ్ దోరణం అశోక్, తూర్పు:15.00 వైడ్ రోడ్డు, పడమర: 15.00 వైడ్ రోడ్డు, ఎవ్వరికైనను పై దస్తావేజులు ఎవ్వరికయినా దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరములున్నచో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393

నల్లగొండ
తేది:05-11-2024

సీఎంఆర్ కొత్త పాలసీకి మిల్లర్లు సహకరించాలి

● పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ చౌహాన్, పక్కన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ సేకరణలో కొత్త పాలసీ తీసుకొచ్చినందున అందుకు మిల్లర్లు సహకరించాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందించాలనే ఆలోచనతో సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్నదని, దీనిని దృష్టిలో పెట్టుకొనే సీఎమ్మార్ విషయంలో 10 శాతం బ్యాంకు గ్యారెంటీ పెట్టినట్లు తెలిపారు. ఇవి పెండింగ్ బకాయిల కోసం కాదన్నారు. సన్నాల కోసమే కొత్త పాలసీ తీసుకొచ్చినందును మిల్లర్లు సహకరించాలని కోరారు. గత వానకాలం, యాసంగిలో రాష్ట్రంలోనే అత్యధిక సీఎమ్మార్ సేకరించి నల్లగొండ ముందంజలో ఉన్నందుకు ఆయన అభినందించారు. ఇక నుంచి సీఎమ్మార్ విషయంలో మిల్లర్లు డీఫాల్ట్ లేకుండా చూసుకోవాలని సూచించారు. సీఎమ్మార్ చెల్లించిన వెంటనే బ్యాంకు గ్యారెంటీలను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ధాన్యం సేకరణ నోడల్ అధికారి అనితా రామచంద్రన్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం సేకరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డీఎం హరీశ్, డీఏఓ శ్రవణ్, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీఎమ్ మార్కెటింగ్ ఛాయాదేవి, ఎల్డీఎం శ్రామిక్ పాల్గొన్నారు.

దేశంలోనే బ్రాండ్‌గా తెలంగాణ రైస్

నల్లగొండ రూరల్ : తెలంగాణ సన్న బియ్యానికి దేశంలోనే బ్రాండ్ తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి తనిఖీ చేశారు. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకే సన్న రకాలపై రూ.500 బోనస్ ఇచ్చి సేకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం విక్రయించిన మూడు, నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీసీఓ సత్యనాయక్, పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగగరత్నం రాజు, సీఈఓ కంచర్ల అనంతరెడ్డి రైతులు ఉన్నారు.

ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం

● పంచాయతీరాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్

నెమ్మాని ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అనితా రామచంద్రన్

నార్కట్‌పల్లి, నవంబర్ 5 : రైతులు అధైర్య పడొద్దని ప్రభు త్వం వారి వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తుందని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. మంగళవారం మండలంలోని నెమ్మాని గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులు ధాన్యం ఆరబెట్టి తేవాలని సూచించారు. తూకం వేసిన వెంటనే ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని, వాటిని వెంట వెంటనే దిగుమతి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఉమేశ్ ఉన్నారు.

ఘనంగా నాగుల చవితి

హాలియాలో పూజలు చేస్తున్న మహిళలు

కేతేపల్లి, నవంబర్ 5 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలను జరుపుకొన్నారు. ఆలయాల వద్ద గల పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఇనుపాముల శివాలయానికి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు.

హాలియా : స్థానిక వేంకటేశ్వరాలయం, సుబ్రమన్నేశ్వరాలయం, పేరూరు శివాలయానికి మహిళలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి పూజించారు.

త్రిపురారం : త్రిపురారం నుంచి బాబుసాయిపేటకు వెళ్లే దారిలో ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద నాగేంద్రస్వామి పడగ వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దామరచర్ల : నాగుల పంచమి సందర్భంగా దామరచర్ల, వాడపల్లి, వీర్లపాలెం, కొండ్రపోల్, దిలావర్‌పూర్ గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టల్లో పాలు పోసి నాగేంద్రుడిని పూజించారు. వాడపల్లి మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న నాగేంద్రస్వామికి అభిషేకాలు చేశారు.

నల్లగొండ: వీటీకాలనీలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

హామీలు అమలు చేయాలి పెన్షనర్ల నిరసన

నల్లగొండ సిటీ, నవంబరు 5: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా సబ్ ట్రెజరీ ఆఫీసర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ లింగా అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తమ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిందని, కానీ 11 నెలలు అయిన వాటిని పరిష్కరించడం లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 19న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నూకల జగదీశ్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్, కుకుడాల గోవర్ధన్, ఎండీ అబ్దుల్‌ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేశ్, గుండాల భిక్షమయ్య పాల్గొన్నారు.

గోడ పైనుంచి పడి సెంట్రింగ్ కూలీ మృతి

నీలగిరి, నవంబర్5 : నల్లగొండ పట్టణంలోని కేశరాజుపల్లికి చెందిన పొనుగోటి నాగేశ్వర్‌రావు (35) మంగళవారం గోడ పైనుంచి కింద పడి మృతి చెందాడు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేశ్వర్‌రావు సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బీటీఎస్‌లో తిప్పర్తి తాసీల్దార్ ఆయేషా ఇంట్లో పని చేస్తున్న క్రమంలో గోడ పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, రెగట్టే మల్లికార్జున్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా తమ మేనల్లుడు భరత్‌రెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను కంచర్ల సోదరులు కేసీఆర్‌కు అందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), నవంబర్ 5 : దేవరకొండ నియోజకవర్గానికి చెందిన 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.17లక్షల విలువైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే బాలూనాయక్ తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దేవరకొండలోని డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్, మాజీ జడ్పీటీసీలు అరుణాసురేశ్‌గౌడ్, బుజ్జిలచ్చీ రాంనాయక్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : డీఈఓ

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

చిట్యాల, నవంబర్ 5 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ప్రాథమిక, వట్టమర్తి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆంగ్ల భాషపై నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఆయన వెంట హెచ్ఎంలు అంబటి సత్తయ్య, నూనెముంతల యాదయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

నల్లగొండ టూటౌన్ ఎస్ఐకి రాష్ట్రస్థాయి అవార్డు

డీజీపీ జితేందర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్ఐ నాగరాజు

నీలగిరి, నవంబర్ 5 : సెల్‌ఫోన్ మిస్సింగ్స్ ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టి రికవరీ చేయడంలో రాష్ట్రంలోనే నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను మొదటి స్థానంలో నిలిచింది. దాంతో టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ఎస్ఐ నాగరాజు అవార్డు అందుకున్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

● టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ అంజయ్య

ఇనుపాములలో ధాన్యం బస్తాల తూకాన్ని పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ అంజయ్య

కేతేపల్లి, నవంబర్ 5 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ అంజయ్య నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని ఇనుపాముల పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను రైతుల సమక్షంలో తిరిగి తూకం వేయించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీఐ పండరీనాథ్, తాసీల్దార్ కమల్‌పాషా, ఎస్ఐలు స్వామిదాస్, పుల్లయ్య, ఏఈఓ నాగరాజు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నిడమనూరు, నవంబర్ 5 : మండలంలోని మారపాక, ఊట్కూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్న ఐకేపీ కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీఓ జి.వెంకటేశం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ కేశబోయిన జానయ్య గౌడ్, మాజీ సర్పంచులు నర్సింగ్ విజయ్‌కుమార్, చంద్రయ్య, గోగుల మహేశ్, మట్లారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ యాకూబ్ అలీ, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ రూరల్, నవంబర్ 5 : మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన పాతకోటి సైదులు (55) మంగళవారం జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ పిల్లి లోకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సైదులు సంవత్సర కాలంగా మండలంలోని ఆలగడప చెరువు వద్ద కాపలా దారుడిగా పని చేస్తూ అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. అతడి భార్య 20 ఏండ్ల క్రితం, కుమారుడు మూడేండ్ల క్రితం మృతి చెందారు. దాంతో ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరి జీవితం గడపలేక జీవితంపై విరక్తితో మంగళవారం ఉదయం కిష్టాపురంలోని రామాలయం వద్ద పురుగుల మందు తాగుతుండగా గ్రామస్తులు చూసి అడ్డుకున్నారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలి : డీపీఓ

మాడ్గులపల్లి, నవంబర్ 5 : మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని డీపీఎం డి.సురేంద్రనాథ్‌బెనర్జీ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 26 మంది మహిళలకు ఒక్కో యూనిట్‌కు 50 చొప్పున పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు నాగయ్య, సైదులు, స్వాగత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కట్టంగూర్, నవంబర్ 5 : ఈ నెల 2 నుంచి 4 వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ స్టేట్ మీట్‌లో నకిరేకల్ డివిజన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 22 కేజీల విభాగంలో ఆమని ద్వితీయ స్థానం, త్రివేణి, సాయిశ్రీ, సమీర్ ప్రతిభ చాటారు. వీరికి ఎమ్మెల్యే వేముల వీరేశం మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు అందించినట్లు సీనియర్ కరాటే మాస్టర్ అంతటి సోములగౌడ్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి :ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, నవంబర్ 5 :కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. మంగళవారం నల్లగొండలో వారిని కలిసిన ఎమ్మెల్యే పలు విషయాలపై చర్చించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో మరిన్ని ఐకేపీ సెంటర్లను ఏర్పాటు చేయాలని, రైస్‌మిల్లుల్లో రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని, అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి : సీపీఎం

చండూరు, నవంబర్ 5: నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే శ్రీశైలం సొరంగ మార్గం, నక్కల గండి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించక పోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని, సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం చండూరులో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి జెర్రిపోతుల నుంజయ, మోగుదాల వెంకటేశం, చిట్టిమల్ల లింగయ్య, దుబ్బాక సాయిలు పాల్గొన్నారు.

సిద్ధార్థలో జాబ్ మేళాకు విశేష స్పందన

రామగిరి, నవంబర్ 5: నల్లగొండలోని సిద్ధార్థ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు హాజరైనట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ గుండెబోయిన జానయ్యయాదవ్, ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలు త్వరలో వెల్లడిస్తారని పేర్కొన్నారు. జాబ్ మేళా హెచ్ఆర్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి

హాలియా, నవంబర్ 5 : పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన మంగళవారం అనుముల మండలం పుల్లారెడ్డిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. తిరుమలగిరి సాగర్ మండలం అల్వాల గ్రామానికి చెందిన నల్లబోతు సైదులు ఐదేండ్ల క్రితం వీర్లగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డిగూడెం గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. గ్రామంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పశువుల మేత కోసం పచ్చిగడ్డి తెచ్చేందుకు పొలానికి వెళ్లాడు. పొలంలో పచ్చిగడ్డి కోస్తుండగా గడ్డిలో ఉన్న నాగుపాముకు కొడవలి తగిలింది. దాంతో పాము సైదయ్యను కాటు వేసింది. వెంటనే సైదులు పొలం నుంచి ఇంటికి వచ్చి